అభివృద్ధిలో కమిటీలే కీలకం



వి.కోట: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణ సమావేశానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఎన్ని వందల వృత్తులు ఉన్నా ఉపాధ్యాయుడి వృత్తే కీలకమైనదని, పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే వారే గురువులని ఆయన కొనియాడారు. పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలదే కీలక పాత్ర అని అన్నారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని పాఠశాలల యాజమాన్య కమిటీల శిక్షణ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం కమిటీ విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణపై వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ వ్యవస్థను తీసుకొచ్చిందని తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలచైతన్య, హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి పాఠశాల కమిటీలు కీలక పాత్ర పోషించాలని ఎంఈఓ ఇందిర అన్నారు. గురువారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్మన్లు, పాఠశాల హెచ్ఎంలకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎంలు మోహన్‌రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ సుజాత, సీఆర్పీలు కిరణ్, అనసూయ, రాజేంద్ర, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ హరిబాబు, ఎంఈఓలు సిద్ధరామయ్య, దామోదర, టీచర్లు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో స్కూల్ కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి ఆధ్వర్యంలో 138 పాఠశాలలకు చెందిన సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్లు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, హెచ్ఎంలు నాగరాజరెడ్డి, పద్మజ, అశ్వత్ నారాయణ పాల్గొన్నారు.



సదుంలో..



రొంపిచెర్లలో మాట్లాడుతున్న ఎంఈఓ

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ నారాయణ మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, డా.సురేష్, మండల రిసోర్స్ పర్సన్‌లు, విద్యాకమిటీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



చౌడేపల్లెలో..



పలమనేరు: మాట్లాడుతున్న ఎంఈఓలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ నారాయణ

క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీడీఓ

రొంపిచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని రొంపిచెర్ల సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. గురువారం రైతు సహాయ కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం తను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేసిన వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పీఎం కిసాన్ పథకంలో రూ.6 వేల నుంచి 10 వేలకు పెంచారన్నారు. సత్యంరెడ్డి, దశరథశేఖర్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, రైతు సహాయ కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటరమణ నాయక్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మస్తానమ్మ, సీసీ రాఘవరెడ్డి, వార్డు మెంబర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సదుం: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు క్విజ్, రన్నింగ్, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి గురువారం తెలిపారు. కౌశల్ భారత్ క్విజ్ పోటీల్లో రెడ్డిప్రసాద్, వినయ్, రెడ్డినాగేశ్వర్, గౌరీశ్వర్ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రం, మెమెంటో, నగదు బహుమతి అందుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ఎంజేపీ సొసైటీ ఆధ్వర్యంలో లేపాక్షిలో జరిగిన రాయలసీమ జోన్ వాలీబాల్ పోటీల్లో స్కూల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మహేంద్రనాయుడు 100, 200 విభాగంలో ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో రెండవ స్థానం, వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌షిప్ సాధించారని వెల్లడించారు. విజేత విద్యార్థులను అభినందించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లి సమీపంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడి ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తులసిమునెమ్మ గుడికి చెందిన ఏసుపాదం కుమారుడు అరుణ్‌కుమార్(32) ప్రైవేటు స్కూల్‌లో టీచర్. ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు బైక్‌లో బయలుదేరాడు. గూడూరుపల్లి సమీపంలో వెళుతుండగా హఠాత్తుగా అడ్డంగా రోడ్డుపైకి పిల్లలు రావడంతో వారిని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలని వినతి



ఎమ్మెల్యేతో దివ్యాంగుల సంఘం నేతలు

రొంపిచెర్ల: దివ్యాంగులను ఆదుకోవాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను రొంపిచెర్ల మండల దివ్యాంగుల సంఘం నాయకులు ఇర్షాద్, మహ్మదాలి కోరారు. గురువారం మదనపల్లెలో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన్ను కలిశారు. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

భూ పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

సదుం: మండల కేంద్రంలో ఆర్డీఓ భవాని గురువారం పర్యటించారు. కల్లూరు మార్గంలోని సర్వే నంబర్ 166, 167లో ఉన్న వ్యవసాయ భూమిని వాణిజ్య అవసరాల మార్పు కోసం దరఖాస్తు చేయడంతో సంబంధిత భూమిని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, వీఆర్వోలు బావాజి, సుబ్రహ్మణ్యం, సర్వేయర్ పవన్ పాల్గొన్నారు.

వైభవం.. కోనేటిరాయుని కల్యాణం



విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు

గంగవరం: మండలంలోని కీలపట్ల శ్రీకోనేటిరాయ స్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చి మాంగళ్యధారణ గావించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు పాల్గొన్నారు.

పాఠశాల కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, చిన్నారులు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని నక్కబండలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలతో కలసి ఆందోళన చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. నక్కబండలో 35 మంది పిల్లలు రోడ్డు లేకపోయినా కల్లుపల్లె పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఈ సమయంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కల్లుపల్లెలో కేవలం ముగ్గురు పిల్లలతో పాఠశాల నిర్వహిస్తున్నారని, 35 మంది పిల్లలు ఉన్న తమకు పాఠశాల ఎందుకు పెట్టరంటూ నిలదీశారు. తమకు పాఠశాల ఏర్పాటు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కవి కొఠారి సేవలు వెలకట్టలేనివి



వెంకటరత్నంను సన్మానిస్తున్న ఎంఈఓ

వి.కోట: 34 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ వెలకట్టలేనటువంటి కవితలు రాస్తూ ఎన్నో అవార్డులను పొంది మండలానికే గుర్తింపు తెచ్చిన కొఠారి వెంకటరత్నం సేవలు వెలకట్టలేనివని ఎంఈఓ చంద్రశేఖర్ కొనియాడారు. గురువారం మండలంలోని చింతలఎల్లాగరం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రిటైర్డ్ కొఠారి వెంకటరత్నంకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ చేతుల మీదుగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన అందించిన సేవలను పద్యం రూపంలో పాడి వివరించారు. ఎస్టీయూ రాష్ట్ర నేతలు గంటా మోహన్, ఇలియాజ్, బుట్టి రాచంద్రుడు, రమణ, వేణుగోపాల్, కిలపర్తి దాలినాయుడు జయప్ప, రఘుపతి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



గంగవరం: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న టీచర్లు



వి.కోట: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం యూటీఎఫ్ 2025 డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం యూటీఎఫ్ నిరంతరాయంగా శ్రమిస్తోందన్నారు. యూటీఎఫ్ నేతలు నాగరాజరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, జి.నాగరాజ, శంకరయ్య, రమేష్, వెంకట్రమణ, మురళి, ఈశ్వర్, సుధాకర్, రమణయ్య, పద్మజ, శివకుమారి, శ్రీదేవి పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్లు..

గంగవరం: జన విజ్ఞాన వేదిక క్యాలెండర్లను ఆ సంస్థ సభ్యులు గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నేత యుగంధర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ప్రధానకార్యదర్శి బాలచైతన్య, జిల్లా ట్రెజరర్ సుదర్శనాచారి, ఎంఈఓ–2 శ్రీనివాసులు, పాఠశాల హెచ్ఎం రూపాదేవి, నేతలు శ్రీధర్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చౌడేపల్లె: డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

పీఆర్‌టీయూ క్యాలెండర్లు..

వి.కోట: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను గురువారం మండల ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. మండల ఎంఈఓ–2 మురుగేష్ చేతుల మీదుగా ఆవిష్కరించి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. హెచ్ఎం ప్రమిళ, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కణ్ణన్, మండల అధ్యక్షుడు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి దేవరాజు, మురళి, కృష్ణమూర్తి, నేతలు నరేస్ మోహన్, చలపతి, రాజేంద్ర, రంజిత్, యుగంధర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అంకెల గారడి



మంగళపల్లె విద్యార్థులు రూపొందించిన అంకెల చదరాలు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం అంకెల గారడీతో 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు సిరి, కీర్తన, జనని 3, 4, 5 గళ్ల వింత చదరాలతో ఎటు కూడినా 2025 వచ్చేలా పూరించారు. గణిత అవధాని అరుణ్ శివప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు పూర్తించిన 3బై3, 4బై4, 5బై5 వింత చదరాలతో ఎటు కూడినా 2025 పూరించారన్నారు. 4బై4 వింత చదరంలో 24 రకాలుగా ఎటు కూడినా 2025 వస్తుందన్నారు. వింత చదరాల అంకెల గారడీ చేసిన విద్యార్థులను హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంజీవి, రమాదేవి, పిళ్లారప్ప, సంపంగి, ధనశేఖర్, భారతి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణిత అవధాని అరుణ్ శివప్రసాద్‌ను అభినందించారు.

వైద్యపరీక్షలు తప్పనిసరి

బైరెడ్డిపల్లె: ప్రతిఒక్కరూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని, దీర్ఘకాలిక వ్యాధుల ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుస్తాయని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. తీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వెంగంవారిపల్లెలో వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ వివరించారు.

అగ్రికల్చర్ ఎంప్లాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుడిపాల: ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ చిత్తూరు ఉద్యోగుల క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వ్యవసాయశాఖ అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పనిని బాధ్యతగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఉద్యోగులందరూ కలిసుంటేనే ఏ పని అయినా సులువుగా చేసేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి బాలమురుగన్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల అవస్థలు



- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు నోచుకోని పుంగనూరు- బెంగళూరు రోడ్డు

పుంగనూరు: సంక్రాంతికంతా రోడ్లు బాగుచేస్తాం ..పండుగకు వచ్చిన సమయంలో రోడ్లు బాగా లేకుంటే ఫిర్యాదు చేయండి...అంటూ గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వాధినేతల మాటలు పుంగనూరులో అమలుకాలేదు. పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను తూతూమంత్రంగా మరమ్మతులు చేశారు. ముఖ్యంగా యాబైరాళ్ల మొరవ వద్ద, బైరేబండకు వెళ్లే రహదారి వద్ద, అరవపల్లి వద్ద కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయకుండా వదిలివేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా!





పలమనేరులో వెళుతున్న కలప ట్రాక్టర్, పలమనేరు నుంచి తమిళనాడుకు వెళుతున్న కలప లారీ

- పగటిపూట ట్రాక్టర్లు.. రాత్రి లారీల్లో తరలింపు
- కటింగ్ ఆర్డర్ మాటే లేదు
- పట్టించుకోని అధికార గణం

పలమనేరు: నియోజకవర్గంలో కలప అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. పగలే ఎటు చూసినా రోడ్ల మీద దూసుకుపోతున్న కలప ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. ఇక రాత్రుల్లో లారీల్లో కలపను లోడ్ చేసి సరిహద్దులు దాటిస్తున్నారు. వాస్తవానికి చెట్ల నరికివేతకు కటింగ్ ఆర్డర్‌ను ఎవరూ తీసుకోవడం లేదు. కలపను కొట్టి అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు అస్సలు పట్టించుకోకపోవడంతో వృక్ష సంపద మాయమవుతోంది. కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటకకు..

నియోజకవర్గంలో ఎక్కువగా రైతుల పొలాలు, ప్రభుత్వ భూములు, అడవుల్లో చెట్లున్నాయి. అడవుల్లో చెట్లు నరకడం కష్టం కాబట్టి కలప వ్యాపారులు రైతుల భూముల్లోని చెట్లను కొనుగోలు చేసి, ఆ చెట్లను నరికివేస్తున్నారు. వాటిని గ్రేడింగ్ చేసి కొంత వంట చెరకు, మరి కొంత పాల డెయిరీలకు, బాగున్న కలపను గృహాలకు తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నీచర్ తయారీకి విక్రయిస్తున్నారు. అలాగే పొరుగు రాష్ట్రాల్లో కలపకు ఎక్కువగా డిమాండ్ ఉండడంతో అక్రమ రవాణాతో జేబులు నింపుకుంటున్నారు. ఇక్కడ కలపకు పెట్టిన పెట్టుబడి, రవాణా ఖర్చులు కలుపుకున్నా రెండింతల పైచిలుకు ఆదాయం కళ్లజూస్తుండడంతో ఈ ప్రాంతంలో కలప 'పుష్పా'లు ఎక్కువయ్యారు.

కటింగ్ ఆర్డర్ మాటే లేదు

సాధారణంగా రైతుల పొలాల్లోని చెట్లను నరకాలంటే ఆ రైతు వీఆర్వో నుంచి అనుమతులు పొందాలి. ఆపై దాన్ని ఆర్ఐ చూసి తహసీల్దార్ ద్వారా ఉత్తర్వులు తీసుకోవాలి. లేదా వాల్టా చట్టం ప్రకారం ఫారెస్ట్ అధికారుల నుంచి సైతం అనుమతి పొందాల్సి ఉంది. గతంలో ఇలాగే జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కటింగ్ ఆర్డర్‌ను జోలికెవరూ వెళ్లడం లేదు. దర్జాగా ఎక్కడ బడితే అక్కడి చెట్లను నరికేసి, కలపను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారు.

మందకృష్ణను విమర్శిస్తే సహించం

పుంగనూరు: ఎంఆర్‌పీఎస్ జాతీయ నేత మందకృష్ణ మాదిగపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎంఆర్‌పీఎస్ నాయకులు మండిపడ్డారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, నాగభూషణం, ప్రభాకర్, వెంకట్రమణ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం ఉద్యమాలు చేశారని కొనియాడారు. అలాంటి ఉద్యమ నాయకుడిని విమర్శించరాదని హెచ్చరించారు. శ్రీనివాసులు, సుబ్రమణ్యం కేశవ, సురేష్, రమణ, మురళి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నరసింహులు